మంగళవారం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 36.0°C

కనిష్ఠం : 19.0°C



శివరాత్రికి ముస్తాబు..

మహాశివరాత్రి పర్వదినం కోసం ఉమ్మడిజిల్లాలోని శైవక్షేత్రాలు, శివాలయాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. హనుమకొండలోని వేయిస్తంభాలగుడి, కాజీపేట మడికొండలోని మెట్టుగుట్ట, వరంగల్ భద్రకాళి ఆలయం, కాశీబుగ్గలోని కాశీవిశ్వేశ్వరాలయం, వెంకటాపూర్ మండలం రామప్ప రామలింగేశ్వర క్షేత్రం, కురవి వీరభద్రుడి సన్నిధి, మహదేవపూర్ మండలం త్రివేణి సంగమ తీరంలోని కాళేశ్వర ముక్తీశ్వర సన్నిధానం.. ఇలా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలన్నీ ముస్తాబవుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేకపూజలతో పాటు రాత్రి జాగరణ కోసం ఆలయాల కమిటీలు, అధికారులు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్ల చేరిక నేడు

హనుమకొండ సిటీ, మార్చి 5: బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు బుధవారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వీరంతా కాంగ్రెస్ కండువాలు కప్పుకోనున్నారు. రెండు రోజులుగా చేరికల కార్యక్రమం వాయిదా పడుతూ వచ్చింది. కార్పొరేటర్లు అందరు హైదరాబాద్‌లోనే మకాం వేశారు. వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నారు. మంగళవారం తూర్పు కార్పొరేటర్లు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ నివాసంలో సమావేశమై చేరికలపై చర్చ జరిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన సమయం మేరకు అందరు హస్తం గూటికి చేరునున్నారు. ఇదిలాఉండగా మేయర్ గుండు సుధారాణి కూడా కాంగ్రెస్‌లో చేరనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆమె వరంగల్ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. అభివృద్ధి పనుల మేరకు కలిశామని సుధారాణి చెబుతున్నా అంతరార్థం కాంగ్రెస్ చేరడమే అని తెలుస్తోంది. ఆమె కూడా బుధవారం పార్టీలో చేరనున్నట్లు ప్రచారంలో ఉంది.



కాంగిరేస్!

వరంగల్ ఎంపీ స్థానంలో భారీగా ఆశావహులు

- 42మంది దరఖాస్తు.. ఉద్యోగుల పేర్లను పరిశీలనకు తీసుకోని అధిష్ఠానం
- ఏఐసీసీకి మూడేసి పేర్లతో టీపీసీసీ ప్రతిపాదనలు
- సింగపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్యల్లో చాన్స్ దక్కేదెవ్వరికో?
- ఇద్దరిలో విజయావకాశాలపై కాంగ్రెస్ అంతర్గత సర్వే
- మంత్రులు భట్టి, కొండా సురేఖ, పొంగులేటి, ఎమ్మెల్యేల అభిప్రాయాల సేకరణ
- అధిష్ఠానం నిర్ణయంపై కాంగ్రెస్ కేడర్‌లో ఉత్కంఠ

వరంగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ లోక్‌సభ సీటుపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ పెరుగుతోంది. ఈ టికెట్ కోసం అత్యధికంగా 42మంది దరఖాస్తు చేసుకోగా.. వీరిలో ఎక్కువమంది ఉద్యోగులే ఉండటంతో వారిని పరిగణనలోకి తీసుకోకుండా, పార్టీలో మొదటి నుంచి పని చేస్తున్నవారిని గుర్తించిన స్ర్కీనింగ్ కమిటీ ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను ఏఐసీసీకి పంపింది. ప్రధానంగా గత ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన సింగపురం ఇందిరా, దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్ పేర్లను స్ర్కీనింగ్ కమిటీ ప్రతిపాదించింది. దీంతో ఏఐసీసీ ఎన్నికల కమిటీ ముగ్గురి బలబలాలపై అంతర్గత సర్వే నిర్వహిస్తోంది. అంతేకాకుండా వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, మంత్రుల అభిప్రాయాలను సీఎం రేవంత్‌రెడ్డి సేకరిస్తున్నారు.

42మంది దరఖాస్తులు

ఎస్సీ రిజర్వ్‌డ్ అయిన వరంగల్ ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లో భారీగా పోటీ ఏర్పడింది. ఫిబ్రవరి నెలలో గాంధీభవన్‌లో ఎంపీ టికెట్ ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వరంగల్ ఎంపీ టికెట్ కోసం ఏకంగా 42మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే వీరిలో ప్రభుత్వ ఉద్యోగులే డజను మందికి పైగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎన్నికల్లో పోటీ చేసేంత డబ్బు ప్రభుత్వ ఉద్యోగులకు ఎక్కడిదనే చర్చ జరిగింది. ఎంపీ టికెట్ కోసం వచ్చిన దరఖాస్తులను ఏఐసీసీ కమిటీ పరిశీలించింది. స్థానికేతరులు కూడా భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. వరంగల్ ఎంపీ సీటును స్థానికేతరులు గెలిచిన చరిత్ర లేకపోవటంతో వారి దరఖాస్తులను కూడా ఆ కమిటీ పక్కన పెట్టినట్టు సమాచారం. ఇక ప్రభుత్వ ఉద్యోగుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకుండా, పార్టీ కోసం పని చేస్తున్న 12మందికిపైగా స్థానిక ఆశావహులను కమిటీ గుర్తించింది. వీరిలో గత ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన సింగాపురం ఇందిర, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన దొమ్మాటి సాంబయ్య, గత అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట సీటు ఆశించిన నమిండ్ల శ్రీనివాస్ పేర్లతో పాటు మరో నలుగురైదుగురి ప్రొఫైల్ కూడా ఏఐసీసీకి టీపీసీసీ పంపించింది. ఒకవేళ ఈ ముగ్గురు కాకుంటే ఈ నలుగురైదుగురిలో ఒక పేరు పరిశీలించాలని కూడా టీపీసీసీ విజ్ఞప్తి చేసినట్టు సమాచారం.

అభిప్రాయ సేకరణ

వరంగల్ ఎంపీ టికెట్ కోసం స్ర్కీనింగ్ కమిటీ రెండు రోజులుగా పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీల్లో సునిల్ కనుగోలు బృందంతో పాటు మరో రెండు సర్వే ఏజెన్సీలతో ఫ్లాష్ సర్వేలు నిర్వహించింది. ఈ సర్వేల్లో మొదటిరెండు స్థానాల్లో ఇందిర, సాంబయ్య నిలిచినట్టు సమాచారం. దీంతో ఈ ఇద్దరి విషయమై పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవవర్గ ఇన్‌చార్జ్‌ల నుంచి ఏఐసీసీ ప్రతినిధులు అభిప్రాయ సేకరణ చేసినట్టు తెలుస్తోంది. వరంగల్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, స్టేషన్‌ఘనపూర్ మినహా ఆరు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. అలాగే పార్లమెంట్ ఇన్‌చార్జ్ మంత్రి కొండా సురేఖతో పాటు ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయాలను ఏఐసీసీ ప్రతినిధులు సేకరించినట్లుగా సమాచారం. ఆర్థిక, అంగబలం ఉండటంతో పాటు పార్టీకి సేవ చేసిన వారిలో ఎవరికి టికెట్ ఇచ్చిన గెలిపించేందుకు కృషి చేస్తామని మెజారిటీ ఎమ్మెల్యేలు స్పష్టం చేసినట్టు సమాచారం. సీఎం రేవంత్ కూడా వరంగల్ ఎంపీపై ప్రత్యేక దృష్టి పెట్టారని, పక్కాగా వరంగల్ సీటులో పాగా వేయాలని, గెలిచే అవకాశం ఉన్నవారికే టికెట్ వస్తుందని ఆయన కాంగ్రెస్ నేతలకు చెప్పారని సమాచారం.

ఇందిర, సాంబయ్య మధ్యే పోటాపోటీ

దరఖాస్తు చేసుకున్న వారు భారీగానే ఉన్నా సింగాపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్య మధ్యే టికెట్ రేస్ ఉందని తెలుస్తోంది. 2004లో పోలీసు ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చిన సాంబయ్య.. పరకాల టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2009లో వరంగల్ ఎంపీ గా టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2012లో బీఆర్ఎస్‌లో చేరిన సాంబయ్య.. 2014లో వైసీపీ గూటికి చేరారు. 2018లో రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లో చేరిన సాంబయ్య.. 2019లో వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి పోటి చేసి ఓటమిపాలయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డితో దొమ్మాటి సాంబయ్యకు సన్నిహిత సంబంధాలు ఉండటమే కాకుండా, 2018లో రేవంత్‌రెడ్డితో పాటు సాంబయ్య కాంగ్రెస్‌లో చేరారు. ఇవన్నీ సాంబయ్యకు కలిసి వచ్చే అవకాశాలుగా పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి.


సింగాపురం ఇందిర


దొమ్మాటి సాంబయ్య

అలాగే సింగపురం ఇందిర తండ్రి దేవదానం 1960లోనే ఎమ్మెల్యేగా పని చేశారు. కాంగ్రెస్ వాదిగా ఉన్న దేవదానం ఇందిరాగాంధీపై ఉన్న అభిమానంతో తన కూతురికి ఇందిర అని పెట్టారు. కాంగ్రెస్‌కు అనుకూల కుటుంబం నుంచి వచ్చిన ఇందిర గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నుంచి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆర్థికంగా బలంగా ఉండటంతో పాటు దళిత మహిళగా తనకే ఏఐసీసీ ఎంపీగా అవకాశం ఇస్తుందనే ఆశతో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షితో ఇందిరకు సత్సంబంధాలున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికి తోడు మహిళలకు 33శాతం టికెట్లు ఇవ్వాలని పార్టీ చేసిన అంతర్గత తీర్మానం లాంటివి తనకు కలిసి వస్తాయనే ధీమాలో ఇందిర ఉన్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట సీటు ఆశించినా అధిష్ఠానం ఆదేశాల మేరకు త్యాగం చేశానని, తనకే వరంగల్ ఎంపీ సీటు వస్తుందనే నమ్మకంతో నమిండ్ల శ్రీనివాస్ ఉన్నారు. మొత్తానికి వరంగల్ ఎంపీ టికెట్ ఎవరికి వస్తుందో అనే ఉత్కంఠ కాంగ్రెస్ కేడర్‌లో కనిపిస్తోంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మృతుడు మోహన్‌రావు

గీసుగొండ, మార్చి 5: వ్యవసాయం కోసం అప్పుచేయగా, అది తీర్చే మార్గం కనిపించ కపోవడంతో మండలంలోని ఆరెపల్లికి చెందిన రైతు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గువ్వాడి మోహన్‌రావు(32) తన కున్న మూడున్నర ఎకరాల్లో మొక్క జొన్న, పత్తి సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సాగు కోసం రెండు లక్షల వరకు అప్పుచేశాడు. పంట దిగుబడి సరిగా రాకపోవటంతో అప్పులు తీర్చే మార్గం కని పించక మనోవేదన చెందేవాడు. ఈ క్రమంలోనే మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఇంటిముందు పడిపో యాడు. గమనించిన అతని తల్లిదండ్రులు 108 ద్వారా ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మోహన్‌రావు మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

ముగిసిన మేడారం హుండీల లెక్కింపు

జాతర ఆదాయం రూ.12,71,79,280

హనుమకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఆదాయం మొత్తం రూ.12,71,79,280 లెక్క తేలింది. గత జాతర కన్నా రూ.26,29,553 ఎక్కువ. గత జాతర ఆదాయం రూ.12,45,49,727. దీనితో పోల్చితే ఈసారి జాతర ఆదాయం ఏ మంత ఎక్కువ పెరగలేదు. ప్రతీ జాతరకు ఆదాయం రూ.కోటిపైనే పెరుగుతూ వచ్చింది. ఈ సారి మాత్రం ఆశించినంత పెరగలేదు. గత జాతర కన్నా ఈ సారి భక్తులు ఎక్కువ గానే వచ్చినట్టు అంచనా. హుండీలను కూడా గతంలో కన్నా ఎక్కువగానే ఏర్పాటు చేశారు.. అయినా జాతర ఆదాయం పెరుగుదల రూ.26 లక్ష లకే పరిమితమైంది. కాగా, మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర హుండీల లెక్కింపు మంగళ వారంతో ముగిసింది. ఆరోరోజు 50 హుండీలను లెక్కించగా రూ.1,46,09,280. జాతరలో భక్తులు బంగారం, వెండి రూపంలో వేసిన కానుకలను కూ డా మంగళవారం మదింపు వేశారు. బంగారం 779 గ్రాముల 800 గ్రాములు కాగా, వెండి 55 కిలోల 150 గ్రాములు వచ్చింది. దీనిని బ్యాంకు ట్రెజరీలో భద్రపరిచారు. గత జాతర కన్నా ఈసారి బంగారం, వెండి కానుకలు కాస్త ఎక్కువగా వచ్చాయి. లెక్కించిన ఉండీ ఆదాయాన్ని బ్యాంకులో జమచేశారు. హుండీల నుంచి వెలువడిన బియ్యం మొత్తాన్ని జల్లెడపటి బస్తాల్లో నింపారు. నాణాలను లెక్కించాల్సి ఉంది. ఈ సారి నాణాలు భారీగానే వచ్చాయి.

కన్నీరుమున్నీరు..

- అశ్రునయనాల మధ్య మోత్యాతండా మృతుల అంత్యక్రియలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే, నాయకుల సంతాపం


రవి మృతదేహం వద్ద విలపిస్తున్న తండావాసులు

పర్వతగిరి/రాయపర్తి/తొర్రూరు రూరల్, మార్చి 5: దుర్గమ్మ పండుగకు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో సోమవారం రాత్రి పర్వతగిరి మండలం మోత్యాతండాలో జరిగిన సంఘటన ముగ్గురు ప్రాణాలను బలితీసుకోవడంతో ఆ తండా వాసులు కన్నీరుమున్నీరయ్యారు. ఆ మృతుల అంత్యక్రియలను మంగళవారం వారి వారి స్వగ్రామాల్లో పూర్తి చేశారు. ఘటనలో గాయపడిన మోత్యాతండాకు చెందిన భూక్యా రవిని చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇక రవి కుమారుడు జశ్వంత్‌కు గాయాలు కావడంతో ఎంజీఎంలోనే చికిత్సపొందుతున్నాడు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం దేవేందర్, సునీల్‌ల మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించగా, రవి మృతదేహాన్ని మోత్యాతండాకు తీసుకువచ్చారు. కుటుంబసభ్యులు, బంధువులు, తండావాసుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలను నిర్వహించారు. ఈ ఘటన నేపథ్యంలో తండాలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా పర్వతగిరి ఎస్సై గుగులోత్ వెంకన్న ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా పోస్టుమార్టం అనంతరం ఎంజీఎం మార్చురీ వద్ద వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చి ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. అలాగే మోత్యాతండాలో భూక్యా రవి కుటుంబసభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం పరామర్శించారు. ఘటన జరిగిన తీరును తెలుసుకుని కుటుంబసభ్యులను ఓదార్చారు.


నరేందర్ (ఫైల్) దేవేందర్ (ఫైల్)

మోత్యాతండా ప్రమాదంలో మృతిచెందిన దేవేందర్ అంత్యక్రియలను రాయపర్తి మండలంలోని జగన్నాథపెల్లి శివారు కొత్త తండాలో మంగళవారం పూర్తిచేశారు. అయి తే దేవేందర్ కుటుంబాన్ని విద్యుత్ షాక్ వెంటాడుతూ వచ్చింది. ఆరు నెలల వ్యవధిలో విద్యుత్ షాక్‌కు అన్నదమ్ములు బలయ్యారు. గుగులోతు అండమ్మ, సీతారాంల పెద్ద కుమారుడు గుగులోతు నరేందర్ ఆరునెలల కిందట అదే తండాలోని వ్యవసాయ బావి వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడు. ఇక చిన్నకుమారుడు దేవేందర్ సోమవారం రాత్రి పర్వతగిరి మండలంలోని మోత్యా తండాలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతిచెందాడు. ఇలా అన్నదమ్ములు ఇద్దరూ విద్యుత్‌షాక్‌కే బలవడంతో తండాలో తీవ్ర విషాదం అలముకుంది. నరేందర్‌కు భార్య సరిత, కుమారుడు, కుమార్తె ఉండగా, దేవేందర్‌కు భార్య మంజుల కుమారుడు ఉన్నారు.

పర్వతగిరి మండలం మోత్యాతండాలో విద్యుదాఘాతంతో మృతిచెందిన బానోతు సునీల్ (19) అంత్యక్రియలు తొర్రూరు మండలం జమస్థాన్‌పురం గ్రామ శివారు సుందర్ నాయక్‌తండాలో మంగళవారం నిర్వహించారు. నిరుపేద గిరిజన రైతు బానోతు వీరూ, సోని దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు సునీల్. వారికున్న 20గుంటల భూమిలో వ్యవసాయం చూసుకుంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సునీల్ ఇంటర్ చదువుతూ కూలీ పనులకు వెళ్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో మోత్యాతండాలో నిర్వహించే దుర్గామాత వేడుకలకు టెంటు వేయడానికి వెళ్లి మృతి చెందాడు. దీంతో తమకు అండగా ఉండే ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయామని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పూర్తి చేయండి

- వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ అర్బన్, మార్చి 5: సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.వాణితో కలిసి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల పురోగతిని అధికారులతో కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సమీక్షలో అడిషనల్ డీఎంఈ శివరాంప్రసాద్, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, ఎంజీఎం, కేఎంసీ సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, మోహన్‌దాస్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగేంద్ర, ఈఈ జితేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గ్యారంటీ' అందేలా చర్యలు

వరంగల్ కలెక్టరేట్: అర్హులందరికీ ప్రభుత్వ ఆరు గ్యారంటీ పథకాల అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అధికారులతో కలిసి ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుపై మునిసిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు సాఫ్ట్‌వేర్ ద్వారా లబ్ధిదారుల వివరాల నమోదు, అర్హులకు గ్యారంటీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతీ మండల ఎంపీడీవో కార్యాలయంలో, మునిసిపాలిటీలలో అవసరమైన మేరకు పాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటర్ నంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తు దారులకు ఇప్పటికే ప్రభుత్వం రూ.500 గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తోందన్నారు. గృహజ్యోతి కింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లులను పంపిణీ చేస్తున్నామని, దరఖాస్తుల సమయంలో వివరాలు సరిగా నమోదు చేసుకోని వారు ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో, ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా తప్పులను సవరించుకోవాలని కోరారు. అన్నారు. గృహజ్యోతి, గ్యాస్ సిలెండర్ పథకాల్లో అర్హతను పరిశీలించి వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రావీణ్య


బోగీ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

రైల్వే యార్డులో అగ్ని ప్రమాదం

- రైలు బోగీకి మంటలు
- మంటల్లో కాలిబూడిదైన బోగీ
- తప్పిన పెనుప్రమాదం

కాజీపేట, మార్చి 5: హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది. స్టేషన్‌కు సమీపంలోని యార్డులో ఉన్న మరమ్మతుకు గురైన కోచ్‌కు నిప్పంటుకుంది. దీంతో మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడి కోచ్ పూర్తిగా దగ్ధమైంది. రైల్వే అధికారులు అప్రమత్తమై ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్ ఇచ్చి మంటలను ఆర్పింది. దీంతో పెనుప్రమాదం తప్పింది. పోలీసులు, రైల్వే సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలోని యార్డు సైడింగ్‌లోని ఉన్న ఓ కోచ్ బోగీకి మంగళవారం ఉదయం నిప్పంటుకోవడంతో మంటలు ఎగిసిపడి కోచ్ పూర్తిగా దగ్ధమైంది. సంఘటనను గమనించిన రైల్వే అధికారులు సిబ్బందితో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపు కాకపోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకుని మంటలు ఆర్పారు. ఓ వైపు మంటలు ఎగిసిపడుతుండగా ఎనిమిది బోగీలతో ఉన్న లింక్‌ను రైలింజన్ తెప్పించి అధికారులు తొలగించారు. మంటలు పూర్తిగా ఆరిపోవడానికి గంటన్నర పాటు సమయం పట్టింది. విషయం తెలుసుకున్న వరంగల్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టీఎస్ఆర్ క్రిష్ణ, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంమ్మూర్తి, టౌన్ ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులు ఘటనాస్థలికి వచ్చి వివరాలు సేకరించారు. స్ర్కాప్ తరలించడానికి సిద్ధంగా ఉన్న మంటల్లో కాలిపోయిన బోగి విలువ సుమారు రూ.ఐదు లక్షలు ఉంటుందని రైల్వే అధికారులు వెల్లడించారు.

ఆరా తీస్తున్న రైల్వే ఇంటెలిజెన్స్

రైలు బోగీ ప్రమాదంపై రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ ఇంటెలిజెన్స్ ఆరా తీస్తున్నారు. నిత్యం రైల్వే ఉద్యోగులు సంచరించే స్థలంలో అగ్ని ప్రమాదం ఎలా జరిగి ఉంటుందనే కోణంలో విచారణ చేపట్టారు. ఎవరైనా ఆకతాయిలు సిగరెట్లు తాగి మంటలంటించారా? కావాలనే బోగీకి నిప్పంటించారా? అనే విషయాలపై లోతుగా పరిశీలిస్తున్నారు. లేక షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా? హైపవర్ సర్క్యూట్ వల్ల జరిగిందా? అనే కోణంలో సైతం ఆరా తీస్తున్నారు. ఘటనాస్థలికి డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి వివరాలు సేకరించి విచారణ చేస్తున్నారు. యాక్సిడెంట్ ఫైర్ కింద కాజీపేట రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎం.రామ్మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన అగర్వాల్



వరంగల్ కలెక్టరేట్, మార్చి 5: ఇటీవల ఏటూర్ నాగారం నుంచి వరంగల్ జిల్లా అటవీ శాఖ అధికారిగా బదిలీపై వచ్చిన అంజు అగర్వాల్ ఐఎఫ్ఎస్ అధికారి మంగళవారం జిల్లా అటవీ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అటవీ శాఖ అధికారులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

దూరవిద్యలో డిగ్రీ, పీజీ ప్రవేశాలకు దరఖాస్తులు

గీసుగొండ, మార్చి 5: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యలో డిగ్రీ, పీజీ ప్రవేశాలకు ఈనెల 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్ఎస్ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ కొక్కొండ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ కోర్సులతోపాటు ఒక సంవత్సరం కాలవ్యవధితో బిజినెస్ మేనేజ్‌మెంట్, రిటైల్ మార్కెటింగ్, టాలీ, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్ స్కిల్స్, యోగ, డిసాస్టర్ మేనేజ్‌మెంట్ కోర్సులు, ఆరు నెలల కాలవ్యవధిని సర్టిఫికెట్ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సుతో పాటు 3 నెలల సర్టిఫికెట్ కోర్సులు అందించబడుతున్నట్లు ఆయన చెప్పారు. మరిన్ని వివరాలకు 99635 91463 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

'లహరి' బస్సుల్లో సుఖవంతమైన ప్రయాణం

ప్రయాణికులకు సౌకర్యంగా పడకలు



లహరి బస్సులో సౌకర్యాలు

సుబేదారి, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వం వరంగల్-1 డిపోకు నాలుగు లహరి సెమీ స్లీపర్ బస్సులను కేటాయించింది. గత నెల 3వ తేదీన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ బస్సులను హనుమకొండ బస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ బస్సులను ఆర్టీసీ అధికారులు హనుమకొండ నుంచి బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఇందులో స్లీపర్, సీటర్ సౌకర్యం ఉంది. ప్రయాణికులకు ఈ బస్సుల్లో 20 బెడ్స్, 22 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 20 మంది ప్రయాణికులు పడుకునేందుకు వీలుగా, 22 మంది ప్రయాణికులు కూర్చుని వెళ్లేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు ఈ బస్సుల్లో ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు రోజు రెండు బస్సులు హనుమకొండ నుంచి బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఈ బస్సు రోజు సాయంత్రం 4:30 గంటలకు ఒక బస్సు, 6:30 గంటలకు మరో బస్సును బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఈ బస్సుల్లో మంటలు, ఇంజన్‌లో పొగలు వస్తే సెన్సార్ల ద్వారా గుర్తించవచ్చు. బటన్ నొక్కితే ఈ బస్సు ప్రయాణించే దగ్గరి డిపోలకు ఇన్ఫర్మేషన్ వెలుతుంది. అప్పుడు అధికారులు అప్రమత్తమై ఎలాంటి ప్రమాదం జరగకుండా కాపాడుకోవచ్చు.

ప్రయాణికులకు సౌకర్యంగా బెడ్స్

హనుమకొండ నుంచి బెంగళూరుకు ప్రయాణించే ప్రయాణికులలో ఎక్కువ మంది ఉద్యోగులు ఉంటారు. గతంలో ఈ బస్సులో లేనప్పుడు వేరే ఆర్టీసీ బస్సులలో కూర్చుని ప్రయాణించినప్పుడు ప్రయాణికులు అలసిపోయి తెల్లారి ఉద్యోగానికి వెళ్లడానికి ఇబ్బందిగా ఉండేది. లహరి బస్సులలో బెడ్స్ సౌకర్యం ఉండడంతో పడుకుని ప్రయాణించడం వలన ఎలాంటి ఇబ్బంది, అలసట ఉండదు. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి కేయూలో రూబీజెస్ట్

కేయూ క్యాంపస్, మార్చి 5: కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 6, 7 తేదీల్లో రూబీజెస్ట్-24 టెక్నికల్ ఫెస్ట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం ప్రారంభం కానున్న రెండు రోజుల సంబురాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లు హాజరుకానున్నారు. కేయూ ఆడిటోరియంలో కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అధ్యక్షతన బుధవారం ఉదయం 10 గంటలకు సంబురాలు వైభవంగా షురూ అవుతాయి. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో టెక్నికల్ సెషన్లు, చర్చలు, సెమినార్‌హాల్‌లో అఖరు రోజున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగా మంగళవారం కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందంలు రూబీజెస్ట్-24 పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే మంగళవారం సాయంత్రం రూబీజెస్ట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు.

ఆటో డ్రైవర్లకు అండగా నిలవాలి

వడ్డెపల్లి, మార్చి 5: ఆటోడ్రైవర్లకు పోలీసు శాఖ అండగా నిలవాలని వరంగల్ ఉమ్మడి జిల్లా ఆటో డ్రైవర్స్ జేఏసీ చైర్మన్ ఎమ్డీ అంకూషా వలి, జిల్లా గౌరవ అధ్యక్షుడు చిర్ర రమేష్ గౌడ్ తదితరులు హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణను కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణను వారు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఏసీపీని కలిసిన వారిలో ఆటో డ్రైవర్స్ జేఏసీ వైస్ చైర్మన్ పసుల యాదగిరి, కన్వీనర్లు దేవర మల్లేష్, బండి లింగయ్య, ఓరుగంటి సదానందం ఉన్నారు.

గ్రంథాలయాల్లో ఉద్యోగుల్లేరు..

● అన్ని పోస్టులు ఖాళీ ● ఇన్‌చార్జిలే దిక్కు ● 30 ఏళ్ల నుంచి నియామకాల్లేవు ● ఉన్న ఉద్యోగులపై పని భారం
● సిబ్బంది లేక ఇబ్బందులు ● ఉమ్మడి జిల్లాలో దీనస్థితిలో గ్రంథాలయాలు ● నోటిఫికేషన్లతో లైబ్రరీలకు నిరుద్యోగులు పరుగు



జనగామ జిల్లా బచ్చన్నపేటలోని శాఖా గ్రంథాలయం



ములుగు జిల్లా కేంద్ర గ్రంథాలయం

హనుమకొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : యువత సర్వతోముఖాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. విజ్ఞానానికి, విరామకాల సద్వినియోగానికి, విశేషజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు మానవ జీవితంలో విడదీయరాని సంబంధం కలిగి ఉంటున్నాయి. ఆధునిక యుగంలో సౌకర్యాలెన్ని పెరిగినా విద్యార్థులకు, ఉద్యోగార్థులకు, నిరుద్యోగులకు విజ్ఞానార్జనకు గ్రంథాలయాలే ప్రధాన ఆధారాలు. విద్యార్థులను విజ్ఞానవంతులుగా, ఉద్యోగార్థులను ఉద్యోగస్తులుగా చేయడంలో కీలక భూమిక పోషించే గ్రంథాలయాలు ఉద్యోగుల కొరతతో కూనారిల్లుతున్నాయి. ఉద్యోగవేటలో ఉన్న నిరుద్యోగులకు చేయూతనిస్తున్న గ్రంథాలయాలే చాలినంత సిబ్బంది లేక చచ్చుపడి పోతున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్లను జారీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లోని ఖాళీలను పట్టించుకోవడం లేదు.

ఉద్యోగార్థుల పరుగులు

గ్రంథాలయాలు విద్యార్థులు, ఉద్యోగార్థుల పాలిట కల్పతరువుగా నిలుస్తున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో మెగా డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు నిర్వహిస్తుండడంతో యువత పఠనాలయాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో కొన్ని రోజులుగా గ్రంథాలయాలు సందడిగా కనినిస్తున్నాయి. కానీ అక్కడ శాశ్వత సిబ్బంది లేక వెక్కిరిస్తున్న ఖాళీలతో వాటి పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దీంతో నిర్వహణ కొరవడి పాఠకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

30 ఏళ్లుగా నియామకాల్లేవు

1995లో శాఖాపరంగా ఉద్యోగాలు భర్తీ చేశారు. ఆ తర్వాత కాలంలో గ్రంథాలయాల్లో ఉద్యోగుల నియామకాలు జరగలేదు. ఈమధ్యకాలంలో అనేక మంది రిటైర్ అయ్యారు. గ్రంథపాలకులు మొదలుకొని స్వీపర్ల వరకు అనేక ఖాళీలు ఏర్పడ్డాయి. అయినా ఈ మూడు దశాబ్దాలకాలంలో వచ్చిన ప్రభుత్వాలు ఏవీ వాటిని భర్తీ చేయలేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే ప్రభుత్వం నెట్టుకువస్తున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులు వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉన్నారు. సిబ్బంది కొరతవల్ల వారిపై అదనపు పనిభారం పడుతోంది. కొన్ని శాఖా గ్రంథాలయాల్లో స్వీపర్లే ఇన్‌చార్జి గ్రంథపాలకులుగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ఒకే ఉద్యోగి రెండు, మూడు గ్రంథాలయాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. ఒక్కోదానికి రెండు లేదా మూడు రోజులు కేటాయిస్తున్నాడు. గ్రంథ పాలకులు లేని రోజుల్లో అటెండరు లేదా స్వీపర్లు గ్రంథాలయాన్ని తెరిచి దినపత్రికలను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. బుక్ సెక్షన్లు మూసే ఉంటున్నాయి. సిబ్బంది కొరత వల్ల చాలా చోట్ల గ్రంథాలయాలను ఎప్పుడు తెరుస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తమకు ఈ పరిస్థితి ఇబ్బందిగా ఉందని ఉద్యోగార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని పాలకులు

గ్రంథాలయాల వ్యవస్థను ఒక ప్రభుత్వ శాఖగా కాక దానినొక సంస్థగా భావిస్తుండడంవల్ల పట్టింపు లేకుండా పోయింది. గ్రంథాలయ సంస్థలు రాజకీయ పదవులకు పునరావాస కేంద్రాలుగా మాత్రమే పనికొస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు అనుకూలమైనవారికి నామినేటెడ్ పదవుల పందారంలో భాగంగా చైర్మన్లను నియమించడంలో ఉన్న శ్రద్ధ.. వాటి నిర్వహణలో కీలక పాత్ర పోషించే సిబ్బందిని నియమించడంలో చూపడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లకాలంలో వాటి గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. చైర్మన్లుగా నియమితులైన వారు సిబ్బంది కొరత వల్ల సైతం గ్రంథాలయాల నిర్వహణను మెరుగుపరచలేకపోతున్నారు.

కనీస వసతులు కరవు

జిల్లా కేంద్రాల్లోని గ్రంథాలయాలకు అరకొర నిధులు ఇవ్వడం మినహా వాటి అభివృద్ధికి పెద్దగా చర్యలు తీసుకోలేదు. మున్సిపాలిటీల నుంచి వచ్చే గ్రంథాల సెస్సే వాటికి ఆర్థిక వనరు. అవి చెల్లించే నిధులతోనే ఏదో విధంగా నెట్టుకువస్తున్నాయి. గ్రామాల్లో పంచాయతీల నుంచి వచ్చే లైబ్రరీ సెస్సు చాలా తక్కువ. చాలా పంచాయతీలు వీటిని చెల్లించడం లేదు. దీంతో గ్రామాల్లో శాఖా గ్రంథాలయాల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. శాఖా గ్రంథాలయాల్లో చాలా వాటికి స్వంత భవనాలు లేవు. అన్నీ అద్దె ఇళ్లలో అరకొర వస్తుల నడుమ నడుస్తున్నాయి. పాఠకులు చదువుకోవడానికి కనీస వసతులు మచ్చుకైనా కానరావు. చాలినన్నీ కుర్చీలు, బెంచీలు లేవు. ఇక పుస్తకాల అందుబాటు అంతంత మాత్రమే..

ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లిలలో ఆరు జిల్లా గ్రంథాలయాలు, 66 శాఖా గ్రంథాలయాలు, ఒక ప్రాంతీయ గ్రంథాలయం ఉన్నాయి. వరంగల్ పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా ఉన్న ప్రాంతీయ గ్రంథాలయం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక లైబ్రరీ. దీనికి సొంత భవనం ఉంది. ఇందులో చాలినంత మంది ఉద్యోగులున్నారు. వీరికి ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లిస్తుంది. మిగతా గ్రంథాలయాల పరిస్థితి వేరు. ఇవన్నీ గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఇందులో పనిచేసే వారంతా గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు. మున్సిపాలిటీలు గ్రంథాలయ సెస్సుద్వారా వచ్చే ఆదాయం నుంచే వీరికి వేతనాలు.

20 ఖాళీలు

హనుమకొండ జిల్లాకు సంబంధించి 33 శాంక్షన్డ్ పోస్టులకుగాను ప్రస్తుతం 13మంది మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ లైబ్రేరియన్లు అయిదుగురు మాత్రమే ఉన్నారు. ముగ్గురు ఔట్‌సోర్సింగ్ విధానం కింద పని చేస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది అంతా పార్ట్‌టైమర్సే. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సమీపంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉమ్మడి జిల్లా అంతటికి అతిపెద్ద లైబ్రరీ. దీనితోపాటు 11 శాఖా గ్రంథాలయాలు, అయిదు గ్రామ గ్రంథాలయాలు, ఒక పిల్లల లైబ్రరీ ఉన్నాయి. ఉద్యోగుల కొరతవల్ల ఒక్కొక్కరు రెండు అంతకన్నా ఎక్కువ గ్రంథాలయాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఇద్దరు గ్రేడ్ 2 లైబ్రేరియన్లకు బదులు ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. మరొకరిని డిప్యూటేషన్‌పై తీసుకున్నారు. ఇద్దరు వాచ్‌మెన్లు ఉండాల్సి ఉండగా, ఒక్కరు కూడా లేరు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించడంతో ఉద్యోగార్థుల కోసం ఈ గ్రంథాలయం పని వేళలను పెంచారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పని చేస్తోంది. చాలినంత మంది సిబ్బంది లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక జిల్లా గ్రంథాలయంతో పాటు 11 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. ఈ 11 లైబ్రరీల్లో రెండింటికే పూర్తికాలపు లైబ్రేరియన్లు ఉన్నారు. మిగతా ఎనిమిదింటిని పంచాయతీ సిబ్బందితో నెట్టుకువస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో జిల్లా లైబ్రరీతో పాటు 12 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. శాఖా లైబ్రరీలు పార్ట్‌టైమ్ ఉద్యోగులతో నడుస్తున్నాయి. ములుగు జిల్లా పరిధిలో తొమ్మిది లైబ్రరీలు ఉన్నాయి. ములుగులో జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంటకాపురం (నూగూరు)లో శాఖా గ్రంథాలయాలున్నాయి. ఈ తొమ్మిది లైబ్రరీలలో ఎనిమిదింటికి గ్రంథపాలకులు లేరు. కొత్త నియామకాలు లేకపోవడంతో వీటి బాధ్యతలు ఇన్‌చార్జిలకు అప్పగించారు. ములుగు సెంట్రల్ లైబ్రరీలో ఒక గ్రేడ్ 1, ఇద్దరు గ్రేడ్ 2, లైబ్రేరియన్లు, ఇద్దరు అటెండర్లు, వాచ్‌మెన్, స్వీపర్, బుక్‌కీపర్, బైండింగ్ వర్కర్, జూనియర్, సీనియర్, రికార్డు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనగామలో ఒక జిల్లా గ్రంథాలయంతో పాటు పది శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. శాఖ లైబ్రరీల్లో వేటికి పూర్తికాలపు లైబ్రేరియన్లు లేరు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నడిపిస్తున్నారు.

హామీలను దాటవేసే ప్రయత్నంలో కాంగ్రెస్

తిరుమలలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

తిరుమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ హామీలిచ్చిందని, కానీ ఇచ్చిన ప్రతి హామీని దాటవేసే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.పదేళ్ల పాటు రాష్ట్రంలో బ్రహ్మాండమైన పరిపాలన అందించినప్పటికీ ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోయిందన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టేలా పరిపాలన చేస్తున్నారన్నారు.ఇప్పటికే రాష్ట్రంలో సాగు, తాగునీటి కొరతతో పాటు విద్యుత్ కొరత కూడా మొదలైందన్నారు. అధికార పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకొచ్చేందుకు పోరాడే శక్తిని కేసీఆర్‌కు ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు.ప్రజలపక్షాన పోరాడే నాయకులను మాత్రమే ఎంపీలుగా ఎన్నుకోవాలని తెలుగు రాష్ట్రాల ప్రజలను కోరారు.

గద్దర్ కళాక్షేత్రాన్ని నిర్మించాలి

వడ్డెపల్లి, మార్చి 5: ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ పేరుతో హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో గద్దర్ కళాక్షేత్రాన్ని నిర్మించాలని గద్దర్ ఆలోచన ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ మంచాల ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గద్దర్ విగ్రహాన్ని అన్ని జిల్లాల కేంద్రాలలో ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో గద్దర్ ఆలోచన వేదిక రాష్ట్ర కో కన్వీనర్ ఐత అనిల్, రాష్ట్ర కో ఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

ఇస్రో పిలుస్తోంది..

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహనే లక్ష్యం ● భావి శాస్త్రవేత్తలకు వేదిక.. యువికా.. ● 9వ తరగతి విద్యార్థులకు దరఖాస్తుల ఆహ్వానం
● ఈనెల 20 వరకు అవకాశం ● ఈనెల 28, ఏప్రిల్ 4న ఎంపిక జాబితా ● ఎంపికైన వారికి మే 13 నుంచి శిక్షణ

జఫర్‌గడ్, మార్చి 5 : పిల్లల ఆలోచనలకు మెరుగులు దిద్దితే భావి తరానికి శాస్త్రవేత్తలుగా మార్చుకోవచ్చు. ఈ విషయాన్ని గుర్తించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో).. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అంతరిక్షపరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఓవినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు అంతరిక్ష శాస్త్రం, అనువర్తనాలపై ప్రాథమికజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా యంగ్ సైంటిస్ట్ పేరుతో యువ విజ్ఞాన కార్యక్రమాన్ని (యువికా) 2019 నుంచి నిర్వహిస్తోంది. బాల్యదశ నుంచే శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, గణితం ఆధారిత పరిశోధన కెరీర్‌లో కొనసాగే వారికి ఇది వేదికగా నిలుస్తోంది. 2024 సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు అర్హులు. ప్రస్తుతం దరఖాస్తుప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. అర్హత, ఆసక్తి గల విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు.

ఈనెల 20 వరకు దరఖాస్తుకు అవకాశం

ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా www.isro.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థి 2024, జనవరి 1 నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతూ ఉండాలి. విద్యార్థులు మొదట వారి ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకున్న రెండు రోజుల తరువాత ఇస్రో ఏర్పాటు చేసే ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ఈ ప్రక్రియ పూర్తయిన గంట తరువాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి ధ్రువ పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఈనెల 28న మొదటి ఎంపిక జాబితా, ఏప్రిల్ 4న రెండో ఎంపిక జాబితాలను ప్రకటిస్తారు. ఎంపికైన వారు మే 12న ఇస్రో సూచించిన కేంద్రాలవద్ద రిపోర్టు చేయాలి.

దరఖాస్తుకు అర్హతలు - వెయిటేజీ కేటాయింపు

దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 8వ తరగతిలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. 9వ తరగతి విద్యార్థులుసహ పాఠ్యాంశాలపై పట్టు కలిగి ఉండాలి. స్కౌట్స్ అండ్ గేమ్స్, ఎన్ఎస్ఎస్‌లో పాల్గొంటే ఐదు మార్కులు, గ్రామీణ ప్రాంత పాఠశాల విద్యార్థికి మరో 15 శాతం అదనపు అర్హత కల్పిస్తారు. ఆన్‌లైన్ క్విజ్ ప్రతిభ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొన్న వారికి 10 శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తారు.

శాస్త్ర, సాంకేతికంపై శిక్షణ

యువ విజ్ఞాన కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు శాస్త్ర, సాంకేతికం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. మే 13 నుంచి 25వ తేదీ వరకు ఇస్రోకు సంబంధించి దేశంలోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్-బెంగుళూరు, స్పేస్ అప్లికేషన్స్‌సెంటర్ -అహ్మదాబాద్, విక్రమ్ సారాబాయ్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ - తిరువనంతపురం, నార్త్ ఈస్ట్ అప్లికేషన్ సెంటర్ - షిల్లాంగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - డెహ్రాడూన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - హైదరాబాద్, నితీష్‌ధావన్ స్పేస్ సెంటర్ - శ్రీహరికోట ఈ ఏడు కేంద్రాల్లో శిబిరాలను నిర్వహించి శిక్షణ ఇస్తారు. రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రయోగాత్మక ప్రదర్శన, ల్యాబ్ సందర్శన, నిపుణులతో ప్రాక్టికల్స్, ఫీడ్‌బ్యాక్ సెషన్‌లు, ప్రముఖ శాస్త్రవేత్తల అనుభవాలు, చర్చ కార్యక్రమాలు వంటివి నిర్వహించడంతో పాటు అంతరిక్ష విజ్ఞానం, రాకెట్ ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తారు. కాగా, ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరికి లేదా గైడ్ ఉపాధ్యాయుడికి ప్రయాణ ఖర్చులు చెల్లింపుతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను ఇస్రో కల్పిస్తుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : పి.రఘునందన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, జనగామ



ఆసక్తి గల 9వ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో శాస్త్రీయ సాంకేతిక అవగాహన, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఈ శిక్షణ అవగాహన పెంచుతుంది. తద్వారా విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుంది. విద్యార్థులు తమ ప్రతిభను చూపేందుకు ఈ కార్యక్రమం చక్కటి వేదిక లాంటిది. జిల్లాలోని తొమ్మిదో తరగతి విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి.

హనుమకొండ మత్స్యశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్ కుమార్ యాదవ్ తనపై వేధింపులకు పాల్పడుతున్నారని, కులంపేరుతో దూషించటంతోపాటు అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఫిషరీస్ అసిస్టెంట్ పి. మేఘన ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. ఈమేరకు ఫిర్యాదు కాపీనీ మంగళవారం మీడియాకు విడుదలచేశారు. హనుమకొండ జిల్లా కార్యాలయం నుంచి భీమారం ఫిష్ ఫామ్‌కు తనను బదిలీచేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఫిష్ ఫామ్‌లో ఒంటరి మహిళకు విధులు వేసి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఐఎఫ్‌టీసీ, ఐనవోలు మండల బాధ్యతల నుంచి కూడా అకారణంగా తప్పించారని తెలిపారు. సిబ్బంది ఎదుట తనను కులం పేరుతో దూషించటంతోపాటు అసభ్యకరమైన వాట్సప్ మెసేజ్‌లు పెడుతున్నారని, పరుష పదజాలంతో మాట్లాడుతున్న నరేష్ కుమార్ నాయుడిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మేఘన విజ్ఞప్తిచేశారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

హనుమకొండ క్రైం, మార్చి 5: సుబేదారి పీఎస్ పరిధిలోని గాయత్రి కాలనీలో ఏడుగురు పేకాటరాయుళ్లను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.15వేల నగదుతో పాటు 2 ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. సీఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలోని గాయత్రికాలనీలో కొద్ది రోజులుగా ఒక ఇంట్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్టు పక్కా సమాచారం అందింది. తమ సిబ్బంది మూకుమ్మడిగా దాడి చేసి 7 గురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి రూ.15వేల నగదు బైక్స్, సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జూదరులను సుబేదారి పోలీసులకు అప్పగించి గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



ఇండియన్ ప్యారడైజ్ ఫ్లై క్యాచర్

భీమునిపాదం వద్ద అరుదైన పక్షులు

కనువిందు చేస్తున్న ఇండియన్ పార్యరడైజ్ ఫ్లైక్యాచర్, మెడల్ ఉడ్ ఓవల్ (గుడ్లగూబ), జంగిల్ ఓవ్‌లెట్ పక్షులు

మహబూబాబాద్ జిల్లా భీమునిపాదం జలపాతం వద్ద అరుదైన పక్షులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి వలస వచ్చిన పక్షులు ఇక్కడ చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి అందాలకు ప్రతీక అయిన భీమునిపాదం వద్ద అనేక రకాల పక్షులు ఆవాసం ఏర్పరచుకోవడం కనిపిస్తోంది. వాటిల్లో ఒకటి ఇండియన్ ప్యారడైజ్ ఫ్లై క్యాచర్. ఈ వింత పక్షి మెడ నల్లగా ఉండి, మిగతా శరీర భాగం తెల్లగా ఉంటుంది. తలపై అదే నల్లరంగులో జట్టు ఉంటుంది. దీని తోకభాగం తెల్లని ఈకెలతో చాలా పొడవుగా ఉంటుంది. ఈ పక్షికి ఈ తోకే ఆకర్షణీయం. ఇక్కడ దర్శనమిస్తున్న మరో పక్షి గుడ్లగూబ. గుడ్లగూబలు సాధారణంగా అడవుల్లో చెట్లకొమ్మలపై ఉంటాయి. సాధారణంగా కనిపించే గుడ్లగూబ కన్నా భీమునిపాదం వద్ద దర్శనమిస్తున్న గుడ్లగూబ పక్షి భిన్నంగా ఉంది. దీనిని మెటల్డ్ వుడ్ ఏవెల్. దీని ఈకలు అచ్చం చెట్టు బెరడు రంగులో ఉంటాయి. అందువల్ల చెట్లపై ఉన్నప్పుడు ఆ చెట్టుబెరడు రంగుతో కలిపిపోయి గుర్తించడం కష్టంగా ఉంటుంది. అందుకే దీనికి లోహపురంగుతో కూడి చెట్టుబెరడు గుడ్లగూబగా పేరువచ్చింది, దీని పిల్లలు బూడిద రంగులో ఉంటాయి. పెరిగిన తర్వాత రంగుమారుతాయి. ఇక్కడే మరో రకం గుడ్లగూబ కూడా సందర్శకులకు కనువిందు చేస్తుంది. ఇది అడవి గుడ్లగూబ. సాధారణంగా అడవిలో మనకు ఎక్కువగా కనిపించే పక్షి ఇదే. దీనిని జంగిల్ ఓవ్‌లేట్ అని పిలుస్తారు. ఇదేకాకుండా అనేక ఇతర జాతి పక్షులను కూడా ఇక్కడ చూడవచ్చు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి



జంగిల్ ఓవ్‌లెట్



మెటల్ వుడ్ వోవెల్



నేడు బీఆర్ఎస్ ధర్నా

వరంగల్‌టౌన్, మార్చి 5: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆ పార్టీ వరంగల్ తూర్పు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం వరంగల్ చౌరస్తాలో మహా ధర్నా నిర్వహించనున్నారు. ఎల్ఆర్ఎస్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై రూ.20వేల కోట్ల భారం మోపడాన్ని నిరసిస్తూ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని నరేందర్ కోరారు.

రేపు డీఎంహెచ్‌వో ఎదుట ధర్నా

పోచమ్మమైదాన్, మార్చి5: నేషనల్ హెల్త్‌మిషన్‌లో పని చేస్తున్న ఆల్ క్యాడర్స్ ఉద్యోగులందరికీ మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 7న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించనున్నట్లు ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, పీఎఫ్ వివరాలు తెలియజేయాలని, చట్ట ప్రకారం రావాల్సిన పీఆర్సీ, ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

'పరస్పర సహకారంతో అభివృద్ధి సాధించాలి'

వరంగల్ కలెక్టరేట్, మార్చి 5: మహిళల పరస్పర సహకారంతో అభివృద్ధి చెందాలని జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జి.సంధ్యారాణి అన్నారు. జిల్లా టీఎన్జీవోఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మరో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి హాజరై మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు వ్యక్తిగత జీవితంతోపాటు వృత్తి జీవితంలో వచ్చే సమస్యలను ఎదుర్కోవడానికి మానసికంగా శారీరక దృఢంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో ఎం.శారద, డాక్టర్ పి.రజిని, డాక్టర్ మమతారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటరమణ, కార్యదర్శి గాజె వేణుగోపాల్, హేమానాయక్, పాలకుర్తి సదానందం, జిల్లా బాధ్యులు యాకమ్మ, రమాదేవి, శ్రీజ్యోతి, రజిత, సునీత, సుశీల, నాయర్, మానస, మేఘన, స్వేత, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల నిర్మాణ పనుల పరిశీలన



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైద్య శాఖ అధికారులు

నర్సంపేటటౌన్, మార్చి5: నర్సంపేట మునిసిపల్ పరిధిలోని సర్వాపురంలో రూ.70 కోట్లతో నిర్మిస్తున్న జిల్లా స్థాయి ఆస్పత్రి భవనం, వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మంగళవారం వైద్యశాఖ అధికారులు పరిశీలించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ వాణి, అకాడమిక్ డీఎంఈ డాక్టర్ శివరాంప్రసాద్, స్థానిక వైద్య అధికారులతో కలిసి పనులు ఏ స్థాయికి వచ్చాయో పరిశీలించారు. యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయ్యాక నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు పరిశీలించి వైద్య కళాశాల నిర్వహణకు అనుమతినివ్వనున్నట్లు వాణి, శివరాంప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ కిషన్, డాక్టర్ మనోజ్‌లాల్ పాల్గొన్నారు.

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన మహేష్

వరంగల్‌టౌన్, మార్చి 5: ఏనుమాముల ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అడువ మహేష్ మంగళవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. 20ఏళ్లుగా పార్టీ బలోపేతానికి కృషి చేశానని, అందుకు సబంధించిన పేపర్ కటింగ్స్, బుక్‌లెట్‌ను మహేష్ కుమార్ గౌడ్‌కు అందజేశారు. పార్టీ అధికారంలో ఉన్నందున తనకు నామినేటెడ్ పోస్టును కేటాయించాలని కోరారు.

అభివృద్ధిలో సీఏలదే కీలకపాత్ర

వరంగల్ సిటీ, మార్చి 5: నవభారత నిర్మాణాభివృద్ధిలో చార్టెడ్ అకౌంటెంట్లు (సీఏ)కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రముఖ సీఏ ఐసీఏఐ మాజీ అధ్యక్షులు పీవీ. నారాయణరావు అన్నారు. ఐసీఏఐ వజ్రోత్సవాల సందర్భంగా వరంగల్ బ్రాంచ్ కార్యాలయంలో మంగళవారం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. మాజీ అధ్యక్షుడు నారాయణ రావును కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ చైర్మన్ భగవాన్‌దాస్, మాజీ చైర్మన్ ఆర్.హరికృష్ణ, సీఏ గీత పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 5: నగరంలోని ఇ చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు పరమ పవిత్రంగా పాంచాహ్నిక దీక్షతో మహా రుద్ర యాగాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శేషు భారతి మంగళవారం తెలిపారు. దక్షిణ భారత దేశంలో తమిళనాడులో పంచభూత లింగాలుగా, ఆంధ్రప్రదేశ్‌లో పంచరామాలుగా, తెలంగాణలోని వరంగల్ మహా నగరంలో ఒకేచోట పంచభూత లింగాలు నెలకొన్ని ఉన్నాయన్నారు. ఖిలావరంగల్ కోటలో స్వయంభూ శంభులింగేశ్వరుడు, మట్టెవాడలో భోగేశ్వరుడు, భద్రకాళి ఆలయంలో భద్రేశ్వరుడు, సిద్దేశ్వరాలయంలో వాయులింగం, మెట్టుగుట్టపై రామలింగేశ్వరుడు ఐదు పంచభూత లింగాలు ప్రసిద్ధిగాంచినవి ఉన్నాయన్నారు. దేవాలయంలో 11 కలశాలు ఏర్పాటు చేసి ఏకాదశ రుద్రులను ఆహ్వానించి లింగ లింగోద్భవ మంత్రాలతో మహారుద్రయాగాన్ని అర్చకులు ప్రారంభించారు.

- వరంగల్‌టౌన్: కాశిబుగ్గ శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రెండో రోజు ఆ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం జరిగే శివకల్యాణానికి కుంభకోణం నుంచి తయారు చేయించి తీసుకువచ్చిన శివపార్వతుల విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గుండేటి నరేంద్రకుమార్, బయ్యస్వామి, గోనె జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.
- ఖిలావరంగల్: మహా శివరాత్రి వేడుకలకు ఖిలావరంగల్‌లోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయం ముస్తాబుతోంది. వారం రోజులుగా కొంతమంది భక్తులు స్టీల్ రేయిలింగ్ (బారికేడ్లు), దేవాలయం వెనకాల కల్యాణ మండపం, భక్తులు కాళ్లు కడుక్కోవడానికి గతంలో ఉన్న వాటర్ ట్యాంక్ మరమ్మతు చేస్తున్నారు. అలాగే ఆలయ ఆర్చ్, గ్రిల్స్, పరిసరాలు గోడలకు రంగులు వేస్తున్నారు. ఈనెల 8,9 రోజుల్లో జరిగే మహాశివరాత్రి పర్వదినానికి ఖిలావరంగల్‌తో వరంగల్, హనుమకొండ, కాజీపేట తదితర ప్రాంతాలనుంచి భక్తులు రానున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, దేవాలయానికి ఇప్పటివరకు కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు మండిపడుతున్నారు. మహాశివరాత్రి పర్వదినం వేళ వచ్చే ప్రముఖులకు ఏర్పాట్లు, తదితర కార్యక్రమాలు చూసేందుకు దేవాదాయ అధికారులు కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గతంలో దేవాలయ చైర్మన్, కమిటీని ఏటా ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం ఇప్పటివరకు కమిటీ ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
- కరీమాబాద్: మహా శివరాత్రి రోజున శంభునిపేట విశ్వనాథ్‌కాలనీలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో శివకల్యాణానికి అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పజారి గంగు సతీష్ శర్మ, సమ్మయ్య, నాగరాజు, రాజేష్, కుమార్, దేవేందర్, సంజు, సుధాకర్, పాల్గొన్నారు.
- సంగెం: మండలం కేంద్రంలోని సంగమేశ్వర ఆలయంలో నిర్వహించే మహా శివరాత్రి మహోత్సవ వాల్ పోస్టర్‌ను మంగళవారం సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. 5 నుంచి 8 వరకు మహా శివరాత్రి మహోత్సవాల సందర్భంగా శివపార్వతుల కల్యాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, కమిటీ ప్రధాన కార్యదర్శి ఆగపాటి రాజు, ఉపాధ్యక్షుడు మునికుంట్ల కోటేశ్వర్, కక్కర్ల శరత్, గుండెటి బాబు, మెట్టుపల్లి రమేష్, కోడూరి సదయ్య, వీరస్వామి, సాంబయ్య, లవకుమార్, నాగార్జున శర్మ, మనోహర్, లక్ష్మీనర్సయ్య, ఏలియా, చిన్ని, సునీల్ పాల్గొన్నారు.



భద్రకాళి ఆలయంలో మహారుద్రయాగాన్ని నిర్వహిస్తున్న పండితులు



కాశిబుగ్గలో కుంభకోణం నుంచి తీసుకువచ్చిన విగ్రహాలకు పూజలు



మధ్యకోటలోని శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు



సంగెంలో ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు

పార్టీ మారిన 3, 43వ డివిజన్ కార్పొరేటర్లు

పోచమ్మమైదాన్/సంగెం, మార్చి 5: నగరంలోని మూడో, 43వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్లు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. మూడో డివిజన్ కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్, 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ అనుచరులతో కలిసి హస్తం గూటికి చేరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో హైదరాబాద్ తరలివెళ్లగా, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మూడో డివిజన్ కార్పొరేటర్ షిభారాణి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు అత్యంత సన్నిహితులుగా పేరుపొందారు. కార్పొరేటర్ దంపతులు కాంగ్రెస్‌లో చేరడంతో డివిజన్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీలో చేరిన అనంతరం దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ-మురళీధర్‌రావు దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే, వీరితో పాటు బీఆర్ఎస్ నాయకులు జన్ను అనిల్‌కుమార్, జన్ను సుందర్, జన్ను రాజయ్య, కొత్తకొండ కృష్ణ, ప్రభాకర్, సిలువేరు విజయ్ కాంగ్రెస్‌లో చేరారు. అలాగే 43వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ ఈదురు అరుణ తన భర్తతోపాటు అనుచరులతో సోమవారం రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తానని తెలిపారు.



ఎమ్మెల్యే నాగరాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్పొరేటర్లు అరుణ, షిభారాణి

కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా న్యాయవాది శేఖర్‌రావు



ఐనవోలు, మార్చి 5: కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నందనం గ్రామానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు నియామకమయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రావు మాట్లాడుతూ.. నమ్మకంతో తనను నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమించిన ఎమ్మెల్యే కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ 34వ డివిజన్ అధ్యక్షురాలిగా కృష్ణకుమారి



ఖిలావరంగల్, మార్చి 5: కాంగ్రెస్ పార్టీ 34వ డివిజన్ మహిళా అధ్యక్షురాలిగా కొనకంచి కృష్ణకుమారిని మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు నారగోని స్వప్న తెలిపారు. శివనగర్‌కు చెందిన కృష్ణకుమారి కొన్నేళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. తననియామకానికి కృషి చేసిన పీసీసీ సభ్యుడు నల్గొండ రమేష్, సీనియర్ నాయకుడు కరాటే ప్రభాకర్, 34వ, డివిజన్ డివిజన్ అధ్యక్షుడు చిట్టిమళ్ళ శ్రీనివాస్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీని కలిసిన అయ్యప్ప దేవాలయం అర్చకులు



వరంగల్ కలెక్టరేట్, మార్చి 5: నగరంలోని శ్రీభద్రకాళి దేవాలయం రోడ్డులోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయ వ్యవస్థాపక నిర్వాహకులు టీఆర్. బాలసుబ్రహ్మణ్య శర్మ , అర్చకులు గణపతి శర్మలు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీని కలిసి అయ్యప్ప స్వామి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

మద్దతు ధరతోనే రైతుకు న్యాయం

రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

గిర్మాజీపేట, మార్చి 5: వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరను చట్టబద్ధత కల్పించినప్పుడే రైతులకు సరైన న్యాయం జరుగుతుందని సామాజికవేత్త, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. మంగళవారం అబ్బనికుంట తెలంగాణ రైతు సంఘం భవనంలో తెలంగాణ రైతు సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'వ్యవసాయ ఉత్పత్తులకు ఇచ్చే మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చంద్రకుమార్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మద్దతు, ధరతోపాటుగా చట్టబద్ధత లేకపోవడంతో రైతాంగం తీవ్రం ఇబ్బందులు పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, వ్యవసాయ ఖర్చులు పెరగడం, అప్పులు చేయడంతో రైతాంగం విలవిలలాడుతుందని వాపోయారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతు సంఘాలు ఢిల్లీ, హర్యానా, పంజాబ్ సరిహద్దుల్లో గత కొన్ని వారాలుగా ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం రైతుల ఆవేదనను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రైతుల మద్దతు ధర చట్టబద్ధతపై ప్రొఫెసర్లు కూరపాటి వెంకటనారాయణ, మరింగంటి యాదగిరాచార్యులు, వినాయక్ రెడ్డి, రైతు సంఘం నేత నైనాల గోవర్ధన్ తదితరులు ప్రసంగించారు. అనంతరం సమావేశం మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, స్వామినాథన్ సిఫార్సులు తక్షణంఅమలుచేయాలని, రాష్ట్రంలో పంటల బీమా పథకంను వానాకాలం నుంచి అమలుచేయాలన్నారు. సమావేశంలో రైతు, ప్రజాసంఘాల నాయకులు సోమ రామ్మూర్తి, ఓదెల రాజయ్య హంసాల్ రెడ్డి, రవిందర్, బుచ్చిరెడ్డి, అంబయ్య, చుంచు రాజేందర్, భాస్కర్, కిషన్‌రావు, కే.ప్రసాద్ పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలి

కరీమాబాద్, మార్చి 5: చేతి వృత్తులపై ఆధారపడి జీవించేవారు కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. మంగళవారం ఉర్సు సీఆర్సీ భవనంలో టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ రమేష్ అధ్యక్షతన చేతివృత్తుల వారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి వివిధ వృత్తులలో శిక్షణ ఇవ్వడంతోపాటు రూ.15వేల విలువైన పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. టీఎంసీ రమేష్ మాట్లాడుతూ 18 రకాల చేతి వృత్తుల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మెప్మా ద్వారా పరిశీలనకు రావడం జరుగుతుందన్నారు.

హామీలను విస్మరించిన పార్టీలకు గుణపాఠం

గీసుగొండ, మార్చి 5: ప్రజలకు హామీలు ఇచ్చి విస్మరించిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు సాయిలి ప్రభాకర్ అన్నారు. మంగళవారం కొమ్మాలలో మాట్లాడుతూ దేశంలో ప్రతియేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి బీజేపీ యువతను మోసం చేసిందన్నారు.

'బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి'



ర్యాలీగా వస్తున్న చేస్తున్న ఎంసీపీఐ(యూ) శ్రేణులు

పోచమ్మమైదాన్, మార్చి 5: దేశ సంపదను కొల్లగొట్టి, పెట్టుబడిదారులకు దోచి పెడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చమరగీతం పాడాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గాదగోని రవి అన్నారు. కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ (సీసీసీ) పిలుపు మేరకు మంగళవారం ఎంసీపీఐ(యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ చౌరస్తా నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికవర్గ పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, నాయకులు పెద్దారపు రమేష్, ఎన్‌రెడ్డి హంసరెడ్డి, మంద రవి, గుండెబోయిన చంద్రయ్య, నాగెల్లి కొమురయ్య, గడ్డం నాగార్జున, నర్ర ప్రతాప్, బాబురావు, రాగసుధ, వెంకన్న పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్ హద్దుల తొలగింపు

సంగెం, మార్చి 5 : ఖిలావరంగల్ మండలం 17వ డివిజన్ దూపకుంట గ్రామ రెవెన్యూ పరిధిలోని అక్రమ లే అవుట్ హద్దులను మంగళవారం జీడబ్ల్యూఎంసీ టైన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ లే అవుట్ ప్లాట్‌ను గుర్తించి తొలగించడం జరుగుతుందని అధికారులు చెప్పారు. అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో చేసే అక్రమ లే అవుట్‌లను తొలగించడం జరుగుందన్నారు.



పదిలో పది గ్రేడ్ సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీపీ, ఏఎంవో

సంగెం, మార్చి 5 : సంగెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పది చదువుకునే విద్యార్థులు పదికి పది గ్రేడ్ సాధించాలని సెక్టోరల్ ఆఫీసర్ -ఏఎంవో మాలోతు సారయ్య, సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి నరహరిలు సూచించారు. మండలం కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని మంగళవారం సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థు లకు పెట్టే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులకు ఓటింగ్‌పై అవగాహన కల్పించారు.

గంజాయి విక్రయిస్తున్న ఎక్సైజ్‌శాఖ ఉద్యోగి అరెస్ట్

మట్టెవాడ, మార్చి 5: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఎక్సైజ్‌శాఖ ఉద్యోగి మహ్మద్ బబ్బార్‌అలీని అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ పవన్‌కుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచే స్తున్న వరంగల్ ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ జబ్బర్‌అలీ మహబూబాబాద్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఇటీవల సీజ్ చేసిన సుమారు 2కేజీల ఎండు గంజాయిని దొంగిలించి వరంగల్ బస్టాండ్ పరిసరాల ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకువచ్చాడు. మంగళవారం సాయం త్రం ఇంతేజార్‌గంజ్ పోలీసులు బస్టాండ్ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మహ్మద్‌జబ్బర్ అలీ ద్విచక్రవాహనంపై ఎండు గంజాయితో తిరుగుతుండగా అనుమానం వచ్చి విచారించారు. దీంతో అతని వద్ద 2 కిలోల ఎండు గంజాయి దొరికింది. ఎండు గంజాయితోపాటు సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నట్లు సీఐ పవన్‌కుమార్ తెలిపారు. ఉద్యోగిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్, ఎస్సై ఎమ్డీ గాలిబ్ షరీఫ్, కానిస్టేబుల్స్ శివ, ఉపేందర్, రాజశేఖర్‌లను సీపీ అంబర్‌కిశోర్‌ఝా అభినందించారు.

ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

మట్టెవాడ, మార్చి 5: ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా వరంగల్ బ్రాంచ్ చైర్మన్‌గా చార్టర్డ్ అకౌంటెండ్ భగవన్‌దాస్ ముందడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఐసీఏఐ సౌత్ ఇండియన్ రీజినల్ చైర్మన్ గీత వచ్చేసి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్‌గా భగవన్‌దాస్ ముందడ, వైస్ చైర్మన్‌గా సత్యనారాయణ పూజారి, కార్యదర్శిగా మదారపు సుజిత్, స్టూడెంట్స్ అసోసియేషన్ చైర్మన్ మన్యం రామకృష్ణ, సభ్యులుగా ఎం.ప్రదీప్‌చందర్, ఆర్.హరికృష్ణలు ప్రమాణం చేశారు. అనంతరం కొత్త కమిటీని పలువురు సీఏలు అభినందించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ బాధ్యులు



వరంగల్ రూరల్

సందేశ్ కాళీ ఘటన నిందితులను ఉరితీయాలి

ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దేవేందర్

నర్సంపేట టౌన్, మార్చి 5 : పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్ కాళీలో జరుగుతున్న మహిళలపై హత్యాచారాలు, ఆదివాసీల భూములను కబ్జా చేస్తున్న వారిని ఉరితీయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం నర్సంపేటలో ఆయన మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు షాజహాన్ షేక్ తన అనుచరులతో అరాచకాలు, ఆగడాలకు పాల్పడుతున్నాడన్నారు. వీరి ఆగడాలపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

అక్కడి సీఎం మమతాబెనర్జీకి ఇలాంటి ఘటనలు కనిపించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని రద్దు చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైద్య శాఖ అధికారులు

వైద్యకళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు

నర్సంపేట టౌన్, మార్చి 5: నర్సంపేట మునిసిపల్ పరిధిలోని సర్వాపురంలో రూ. 70 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న జిల్లా స్థాయి ఆస్పత్రి భవనం, వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మంగళవారం వైద్య శాఖ అధికారులు సందర్శించి పరిశీలించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ వాణి, అకాడమిక్ డీఎంఈ డాక్టర్ శివరాంప్రసాద్, స్థానిక వైద్య అధికారులతో కలిసి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణ పనులు ఏ స్థాయికి వచ్చాయో పరిశీలించి పనులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు పరిశీలించి వైద్య కళాశాల నిర్వహణకు అనుమతినివ్వనున్నట్లు డాక్టర్ వాణి, డాక్టర్ శివరాంప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ కిషన్, డాక్టర్ మనోజ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి విజేతలుగా ఉప్పరపల్లి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం జయ

చెన్నారావుపేట. మార్చి 5: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలల్లో భాగంగా రిజర్వు బ్యాంకు వారు విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, నినాదాల పోటీలల్లో వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలల్లో మండలంలోని ఉప్పరపల్లికి చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచి బహుమతులు సాధించినట్లు హెచ్‌ఎం జయ మంగళవారం తెలిపారు. రెండు విభాగాలల్లో నిర్వహించిన పోటీలల్లో విద్యార్థులు ఆర్ కీర్తన, వెలిదె ఆకాష్‌లు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయిలో రూ 2 వేలతో పాటు ప్రశంస పత్రంను అందకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ బ్యాంకు అధికారి జిల్లా బ్యాంక్ మేనేజర్ హవేలిరాజు, గైడ్ టీచర్‌లు మాధవి, మమత, ఉపాధ్యాయులు సునిత, బాలాజీరావు. సంతోష్, మురళి, రవిందర్, మోహన్‌రావు, రమేష్, కృష్ణ, చింతకింది ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ నాయకులపై కేసులు ఎత్తివేయాలి

వర్ధన్నపేట, మార్చి 5: పోడు భూముల సాధన, పట్టాల కోసం ప్రాణత్యాగాలతో పోరాడుతున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకత్వంపై మోపిన పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతోపాటు ప్రజాస్వామిక పాలనను ఏడో గ్యారంటీగా వాగ్దానం చేసిందన్నారు. కానీ న్యూడెమోక్రసీ నాయకులను అరెస్టు చేయడం అప్రస్వామికమన్నారు. మొత్తం 24 మందిపై అక్రమంగా మోపిన కుట్ర కేసును బేషరతుగా ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గృహజ్యోతితో పేదల జీవితాల్లో వెలుగులు

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట రూరల్, మార్చి 5 : రాష్ట్రంలోని పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేదే గృహజ్యోతి పథకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని ఇల్లందలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించిన ఆయన స్పాట్ బిల్లింగ్‌ను తీసి లబ్ధిదారులకు జీరో బిల్లులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా అసలైన పేదలకు లబ్ధి చేకూరే విధంగా రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ గృహజ్యోతి పథకం కింద ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, రూ. 500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో ముందు చూపుతో పథకాలను ప్రజలకు అందేలా చేస్తున్నాడని వివరించారు. రాష్ట్రంలోని ప్రతీ పేదవాడు కాంగ్రెస్ పథకాలు అందుకుని సంతోషంగా ఉండాలనేదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల ప్రేమాభిమానాలు జీవితంలో మరిచిపోలేనని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నానని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో వర్ధన్నపేటను అన్ని రకాలగా అభివృద్ధిలో ముందుంచుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రూరల్ డీఈ భిక్షపతి, ఏడీఈ కన్న రాజు, సబ్ ఇంజనీర్ దయాకర్, లైన్‌మెన్ లక్ష్మణ్, నాయకులు ఎద్దు సత్యనారాయణ, తాళ్లపెల్లి శ్రీనివాస్, పోశాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఉచిత విద్యుత్ స్పాట్ బిల్లును అందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

● వర్ధన్నపేట: ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచించారు. మంగళవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షెడ్యూల్డ్ కులా సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో సుమారు 18 మందికి వివిధ రంగాల ద్వారా లబ్ధి పొందిన సబ్సిడీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, సీనియర్ నాయకులు వెంకన్నగౌడ్, మాజీ జడ్పీటీసీ కమ్మగోని ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరెగూడెంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, మార్చి 5 : తెలంగాణలోని సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతీ ఒక్కరు కాపాడుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ఆరెగూడెంలో జరిగిన దుర్గమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయాలు దేశానికే ఆదర్శమని, వాటిని కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలే నేటికీ పేదలకు అండగా ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలులో మీనమేషాలు లెక్కిస్తోందని, ఆ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్‌ఎస్‌పై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీలో వయోపరిమితి పెంచాలి

వర్ధన్నపేట, మార్చి 5: మెగా డీఎస్సీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మరో మూడు సంవత్సరాల వయోపరిమితి పెంచాలని స్వచ్ఛంద సామాజిక సేవా కార్యకర్త బంకా మాణిక్యారావు అన్నారు. మంగళవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సర నుంచి వేచి చూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మంచి శుభవార్త తెలియజేసిందన్నారు. ముఖ్యంగా వయో పరిమితి 55 సంవత్సరాల వరకు సడలింపు ఇవ్వాలన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన చేయాలని కోరారు.

తెలంగాణలో ప్రజాపాలన మొదలైంది

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి

రాయపర్తి, మార్చి 5 : గత పది సంవత్సరాల పాటు రాష్ట్రంలో రాచరిక పాలన జరిగిందని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలన మొదలైందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మండలంలోని తిర్మలాయపెల్లిలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ సహకారంతో విద్యార్థినులకు ల్యాప్ టాప్‌లు, ఆట వస్తువులు, ఇతర సామాగ్రి పంపిణీ చేసి, స్థానిక లక్ష్మి నర్సింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలన కేంద్రానికి వచ్చిన దరఖాస్తులను వెంటనే అధికారులు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కార్యక్రమాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేస్తోందని, మరిన్ని పూర్తి చేస్తుందని స్పష్టంచేశారు.

భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలంటే విద్యార్థినులు నిబద్ధతతో చదువుకోవాలన్నారు. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి తమ వంతు కృషిచేస్తామని, ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్, కృష్ణారెడ్డి, ముద్దరబోయిన వెంకన్న, ఎనగందుల మురళీ పాల్గొన్నారు.



ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నారీ శక్తి వంధన్ యోజనకు ఏర్పాట్లు

వర్ధన్నపేట, మార్చి 5: వర్ధన్నపేట పట్టణంలోని ఎంఎంఆర్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించే నారీ శక్తివంధన్ యోజన కార్యక్రమ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ నాయకులు వెల్లడించారు. మంగళవారం గార్డెన్‌లో చేపడుతున్న పనులను పరిశీలించిన అనంతరం బీజేపీ పట్టణ అధ్యక్షుడు చిటూరి రాజు, కార్యక్రమ ఇన్‌చార్జి రాయపురపు కుమారస్వామి మాట్లాడుతూ నారీ శక్తివంధన్ యోజన కార్యక్రమం మహిళలకు ప్రాధాన్య ఇస్తూ చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం 10 గంటలకు దేశవ్యాప్తంగా ఉన్న మహిళలతో ప్రత్యక్ష ప్రసారం ద్వారా మాట్లాడనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాంపల్లి యాకయ్య. ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దూరి రాజు, మాజీ పట్టణ అధ్యక్షుడు కొండేటి సత్యం, మంద అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



గాయ పడిన గీత కార్మికుడిని పరామర్శిస్తున్న సంఘం నేతలు

దుగ్గొండి, మార్చి5: గత ఆరు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాలను వెంటనే మంజూరు చేసి గీత కార్మికులకు న్యాయం చేయాలని గౌడ జనహక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటాపురంలో ఇటీవల గాయ పడిన గీత కార్మికుడు పోగాకు సమ్మయ్యను మంగళవారం పరామర్శించిన అనంతరం మాట్లాడారు. గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాలు పెండింగ్‌లో ఉండడంతో గాయపడిన గీత కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే చెల్లించి న్యాయం చేయాలని రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. పరామర్శించిన వారిలో గోపగాని వెంకట్‌గౌడ్, రాందాస్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, రాంగౌడ్, భద్రసేనాగౌడ్, మద్దెల సాంబయ్య, పోగాకు రాజు తదితరులు ఉన్నారు.

ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎస్సై రఘుపతికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఖానాపురం. మార్చి 5: ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై రఘుపతిని మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు ఆధ్వర్యంలో బుధరావుపేట కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి బోకే అందజేసి, శాలువాతో సన్మానించి శుభకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బుధరావుపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ లాల్‌సాబ్, ఎంపీటీసీ బిక్కి లింగమ్మ మురళి, పొడుపుగంటి మధు, పులి వెంకన్న, కిసాన్‌సెల్ అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్, చాంద్‌పాషా, షేక్ శుక్రుమియా, నర్సయ్య, పరిటాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజానికి మార్గదర్శకం కావాలి

నర్సంపేట సివిల్‌కోర్టు జడ్జి శిరీష

చెన్నారావుపేట, మార్చి 5 : ప్రతీవిద్యార్థిని ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయడంతో పాటు సమాజానికి మార్గదర్శకం కావాలని నర్సంపేట సివిల్‌కోర్టు జడ్జి శిరీష అన్నారు. నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళాదినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్జి శిరీష మాట్లాడుతూ శిశుసంక్షేమం కోసం అందుబాటులో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఏరకమైన నేరాల జోలికి వెళ్లకూడదని సూచించారు. ఏదైనా నేరంలో పేరు నమోదైతే దాని నుంచి బయటపడడం చాలాకష్టమని తెలిపారు. జడ్జి శిరీష, డాక్టర్ లెక్కల విద్య, మల్లం పద్మలను ప్రిన్సిపాల్ మల్లం నవీన్, అధ్యాపకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మహిళాసాధికారత సభ్యులు డాక్టర్ సుమతి, ప్రసూన, శైలజ, స్వరూపరాణి, షహిస్సులానా, లావణ్య, కళాశాల కో ఆర్డినేటర్ శ్రీనాథ్, తోట రమేష్, సత్యనారాయణ, విష్ణు, కుమార్, శివనాగ శ్రీను, లకన్‌సింగ్, నరేందర్, పూర్ణచందర్, సమ్మయ్య, బి.రమేశ్, ఆర్.కుమారస్వామి పాల్గొన్నారు.



డిగ్రీకళాశాలలో జడ్జి శిరీషను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఆకట్టుకుంటున్న నాటక పోటీలు



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

వర్ధన్నపేట, మార్చి 5: భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ప్రతి రోజు రెండు నాటక ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం హైదరాబాద్‌కు చెందిన సిరిముప్వ కల్చరల్స్ వారి హక్కు నాటికను ప్రదర్శించగా, అవ్వ- అప్పచ్చి అనే రెండు నాటక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింపజేలా సాగాయి. హక్కు అనే నాటికను ఆడారి సోమశేఖర్ రచించారు. సంస్కృతి, సంప్రదాయం అన్న విషయాలను పట్టించుకోకుండా, మంచిచెడులను, దురాలోచన చేయకుండా పటిష్టంగా నిర్మించని చట్టాల వల్ల కూలిపోతున్న సమాజంలోని కుటుంబాల మధ్య జరుగుతున్న సంఘర్షణల ప్రతిరూపమే ఈ హక్కు. నాటిక ప్రధాన కథాంశం. ఈ రెండు నాటికల్లో కళాకారులు తమ పాత్రల్లో తమదైన శైలీలో నటించి వీక్షకులను మెప్పించారు.

అక్రమ లే అవుట్ హద్దుల తొలగింపు

సంగెం, మార్చి 5 : ఖిలావరంగల్ మండలం 17వ డివిజన్ దూపకుంట గ్రామ రెవెన్యూ పరిధిలోని అక్రమ లే అవుట్ హద్దులను మంగళవారం జీడబ్ల్యూఎంసీ టైన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ లే అవుట్ ప్లాట్‌ను గుర్తించి తొలగించడం జరుగుతుందని అధికారులు చెప్పారు. అను మతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో చేసే అక్రమ లే అవుట్‌లను తొలగించడం జరుగుందన్నారు.



హద్దులను తొలగిస్తున్న అధికారులు

విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధం

చెన్నారావుపేట, మార్చి 5: విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధంమైన ఘటన మండలంలోని లింగగిరిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్థులు, బాధితుని కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శివరాత్రి సమ్మయ్యకు పూరి గుడిసెలో సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. మంగళవారం తెల్లవారు జామున ఇంట్లో ఉన్న వైర్లుకు షాట్ సర్క్యూట్ కావటంతో మంటలు చెలరేగి పూరి గుడిసె పూర్తిగా దగ్ధం అయింది. గుడిసెలోని బీరువాలో ఉన్న రూ 1లక్షల 50 వేలు, బ్యాగులో ఉన్న రూ 50 వేల నగదు, ఏడు క్వింటాళ్ల బియ్యం, బీరువా, మంచాలు, బట్టలు, కాలి బుడిదయ్యునట్లు బాధితుడు రోదిస్తు తెలిపాడు. కాగా నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఆర్థిక సాయం అందించాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు. కాగా ఘటన స్థలాన్ని ఎస్సై గూడ అరున్‌కుమార్‌లు పరిశీలించారు.



కాలిన గుడిసె ఎదుట బాధిత కుటుంబం

అదనపు కట్నం కోసం వేధింపులు..

భర్త, అత్త, మామలపై కేసు నమోదు

దుగ్గొండి, మార్చి 5: అదనపు కట్నం కోసం భర్త, అత్త మామలు వేధించినట్లు బాధితురాలు మంగళవారం దుగ్గొండి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం ప్రకారం దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన అడప బుచ్చయ్య, కోమలల కుమార్తె నాగరాణికి, నెక్కొండ మండలం దీక్షకుంట్లకు చెందిన జల్లి బుచ్చయ్య, శారద కుమారుడు నరేశ్‌తో 2017లో వివాహం జరిగింది. వివాహం సమయంలో పసుపు కుంకుమ కింద(కట్నంగా) ఎకరం భూమి, 15 తులాలు బంగారం, రూ:2లక్షలు నగదు చెల్లించారు. నరేష్, నాగరాణి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె జన్మించారు. ఏడాది కాలం నుంచి భర్త, అత్త, మామలు కలసి అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురి చేస్తున్నట్లు బాధితురాలు నాగరాణి పేర్కొంది. ఈ విషయమై గతంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ కూడా జరిగింది. ఈ క్రమంలో ఈ నెల 4 న రాత్రి భర్త నరేష్, నాగరాణిని అదనపు కట్నం తీసుకురావాలని కొట్టగా ఈ విషయాన్ని నాగరాణి తల్లిదండ్రులకు ఫోన్ చేసి తెలిపింది.

తల్లిదండ్రు లకు భర్త కొట్టిన విషయం చెప్పిందన్న కోపంతో భర్త, అత్తమామలు వేడి చేసిన గరిటతో తన చేతులపై కాల్చినట్లు బాధితురాలు పేర్కొంది. విషయం తెలుసు కున్న ఆమె తల్లిదండ్రులు, సోదరుడు రఘు వచ్చి ప్రశ్నిం చగా వారిపై దాడి చేసి గాయ పరిచినట్లు పేర్కొన్నారు. దీంతో వారు దుగ్గొండి పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు.



నాగరాణి చేతులపై కాలిన గాయాలు